
# నాల్గోడల మధ్య...



సుస్మితా రమణమూర్తి

ఆఫీసులో గోడ గడియారం పదిసార్లు తన గుండె బాదుకునే సమయానికి మధుమూర్తి సుతారంగా వేలి అంచులతో జుత్తు సవరించుకుంటూ— జనాలంతా వచ్చేశారా? ...లేక తనలాంటి 'లేట్' బాపతు ఇంకెవరైనా ఉన్నారా? —అన్నట్లు తన మిత్రుల కుర్చీల వేపోసారి అల వోకగా దృష్టి సారించి తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

"ఏంటి గురూ! మన ఆఫీసరు ట్రాన్స్ఫరై వెళ్ళిపోయిం దగ్గర్నుంచి చూస్తున్నాను. అవకాశం దొరికింది కదాని ఎప్పుడూ ఆలస్యంగా రావడమేనా? నీలా అంతా అనుకుంటే ఆఫీసు పని ఎలా అవుతుంది చెప్పు!" తన సీటు పక్కనే ఉన్న సూపరెంట్ గోపాలం నవ్వుతూ మధుమూర్తి మీ దో బాణం గురి చూసి వదిలాడు.

మధుమూర్తి తన మాటల్ని పట్టించుకోలేదు. జేబులోంచి సిగరెట్ పేకెట్ తీసి గోపాలం కోటిచ్చి, తనోటి అంటించుకుని విలాసంగా సిగరెట్ కాలుస్తూ నవ్వుతూ అన్నాడు : "గురూ! వాడెలాగూ పోయాడు. వాడున్నప్పుడు అరుపులు — పెడ బొబ్బలు మనకెలాగూ తప్పలేదు. ఈ నాలుగు రోజులైనా కాస్తంత ఫ్రీగా ఉండటంలో తప్పేం ఉంది? వచ్చే వారంలో ఎలాసూ ఎవడో శ్రీమన్నారాయణ పోయినోడి స్థానంలో రానున్నాడు కదా? అప్పుడెలాగూ తప్పదు మనకు. ఇక వాడి పరిపాలన ఎలా గుంటుందో ఏమో?..."

గోపాలం కూడా మధుమూర్తి మాటలకి నవ్వేశాడు.

"వచ్చేవాడి సంగతేమో గాని — ట్రాన్స్ఫరై పోయినోడు కాగితం పులి మాత్రం కాదు. "ఎల్డీసీ ఆనందం హస్యాయణంలోకి తన తల దూర్చాడు.

"అవును గురూ! మూన్నెల్ల క్రితం మన ఆనందం ఫాదర్కి సీరియస్గా ఉందని టెలిగ్రాం వచ్చినప్పుడు సెలవు పెట్టకుండానే వెళ్ళిపోయాడు కదా? ఆ తరవాత ఆఫీసర్ — వీడి మీద ఎంత ఎగిరిపోలేదు? అలాని వీడికి వార్నింగు లెటర్ ఇవ్వడమో లేక కాన్ఫిడెన్షియల్ రిపోర్టు ఖొక్కపెట్టడమో చేస్తే —మనోడికి నాడు ప్రమోషన్ వచ్చి ఉండేదే కాదు. ఏమైనా పోయిన గురుడు అరుపుల గొడ్డే గాని కాగితం పులి మాత్రం కాదురా!" శ్రీనివాసరావు కల్పించుకున్నాడు.

"నిజం! నిజం! ఆ మాట అక్షరాల నిజం! పదేళ్ళ అనుభవం గల మన 'స్టెనో' సత్యం ఇంట్లో పరిస్థితులు బాగా లేకపోవడం వల్ల ఆఫీసరిచ్చినడిక్టేషన్ సరిగ్గా తీసుకోక పోవడం వల్ల — తప్పుల తడకలతో టైపు చేసిన కాపీ చూసిన ఆఫీసర్ — ఎప్పుడూ ఎంతో నీట్గా తప్పుల్లేకుండా టైపుచేసే సత్యంకి — ఎందుకిలా ఇన్ని తప్పులు పడ్డాయా? అన్న కోణంలో ఆలోచించి — విషయం తెలుసుకుని మనవాడికి వెయ్యి రూపాయల లోన్ శాంక్షన్ చేయించాడే గాని — హోతూత్తని అనవసరంగా ఎగిరిపోలేదు కదా?" కాషియర్ నీలమణి.

"ఎప్పుడూ గొడ్డులా పని చేయించుకోవడం గొప్పకాదు. ఎప్పుడైనా — ఏ కారణం చేతనైనా ఎవరైనా పనిలో తప్పులు చేస్తే ఆ తప్పుల్ని తేలిగ్గా తీసుకుని — అలా ఆ వ్యక్తి ఎందుకు చేయాల్సి వచ్చిందో తెల్సుకోడానికి ప్రయత్నించి— తనకున్న పవ్రరీవ్ని తెలుసుకుని— వీలైతే సహాయం

చేయడానికి ప్రయత్నం చేయడమే మంచి ఆఫీసర్ యొక్క లక్షణం! తన కింద పన్జేస్తున్న వాళ్ళ వెల్ ఫేర్ చూడని ఆఫీసర్ నా దృష్టిలో మంచి, మానవత్వం లేనివాడు!'' మధుమూర్తి.

''ఒ. కె. ఒప్పుకున్నాం! పోయిన గురుడు మంచోడే! ఎంత మన మీాద అరిచినా — కేక లేసినా ఏవిూ మనసులో పెట్టుకోని వాడు గనుకే మన రిపోర్టులు బాగా రాశాడు. నీ కెలా తెల్సోయ్ ఆ విషయం?— అని మాత్రం అడక్కండి నాకు తెల్సంతే!—

పోయినో డెలాగూ పోయాడు. వాడు మనకి మంచి చేశాడు కాబట్టే బ్రహ్మాండంగా సెండ్ ఆఫ్ పార్టీ చేశాం. ఇంకా వాడి గురించి— వాడి మంచి గురించి చెప్పుకుంటున్నాం. ఇంతకీ ఆ రాబోయే శ్రీ మన్నా రాయణుడె లాంటివాడో!?'' శేఖర్.




అపూర్వమైనది లిరిల్. పచ్చని తరంగరేఖలు. నిమ్మకాయల్లోని తాజాదనపు ఉత్సాహంతో. చురుకైన, పులకరింపజేసే లిరిల్ మిమ్మల్ని నవనారిగా రూపొందిసుంది.

**లిరిల్**
తాజాదనపు సబ్బు **నిమ్మకాయల తాజాదనపు ఉత్సాహంతో**

లింటాస్-LR.27-203 TL

హిందూస్థాన్ లీవర్ వారి విశిష్ట ఉత్పత్తి

ఆ ఆఫీసు మిత్రులందరిలోను ఆ 'శ్రీ' ఎలాంటి వాడా? — అన్న ఆలోచన తలెత్తింది.

"గురూ! నేను ఢిల్లీలో పన్జేసేటప్పుటు మా ఆఫీసర్ రాబోయే ఆ శ్రీ యే!..." గోపాలం.

"మరింకేం సూపరెంట్ గారూ! ఆ గురుడి సంగతి మీకు బాగా తెల్సుంటుంది. ఇంతకీ ఎలాంటోడు? కేకల గొడ్డా? లేక... కలం పోటోడా?" ఆత్రంగా — కుతూహలంగా అడిగేడు మధుమూర్తి.

"గురుడంత మంచోడు కాడు."

"మంచోడు కాదంటే!?... ఎలాంటోడని మీ అభిప్రాయం!?"

"ఏడాదంతా ఎలా ఉన్నప్పటికీ — ఆ డిసెంబర్ నెలలో మాత్రం అందరూ ఒళ్ళు దగ్గరుంచుకుని పన్జేయాలి. లేకుంటే ప్రతి సిల్లీ విషయాన్ని మనసులో పెట్టుకుని మన సర్వీస్ రికార్డుల్ని ఖరాబ్ చేసే మనిషితను." గోపాలం తనకు తెల్సింది సింపుల్‌గా చెప్పాడు.

"డిసెంబర్ నెల సంగతా? మనుషులుపోతే మనోళ్ళువర్ధంతులు చేస్తారు. పుడితే మాత్రం జయంతులు చేస్తారు. అయితే ఆ శ్రీ మన్నారాయణుడి హయాంలో మాత్రం ప్రతి డిసెంబరులోను మనుషులు బ్రతికున్నప్పటికీ జయంతులూ చేసుకోవాల్సి వస్తుంది. వర్ధంతులూ చేసుకోవాల్సి వస్తుంది. ఆ గురుడితో నాకూ కొన్ని డిసెంబర్ నెలల పరిచయ భాగ్యం హైదరాబాద్‌లో ఉన్నప్పుడు కలిగింది." ఆనందం తన భయాన్ని, ఆందోళనని, అనుభవాన్ని వివరించాడు.

"అందరిలోను ఆనందం మాటలకి భయాందోళనలు చెలరేగాయి. చాలామందికి డిసెంబర్— జయంతి — వర్ధంతి — మాటలకు అర్థం తెలియక దిక్కులు చూడసాగారు.

కొంతమంది తమ సందేహాన్ని తెలియజేశారు కూడా.

"ఇందులో అర్థం కానిదేవుంది? వర్ధంతి చచ్చిన వాళ్ళకి వర్తిస్తుంది. జయంతి పుట్టేవాళ్ళకు సంబంధించినది. డిసెంబర్‌లో —'వర్ధంతి' అంటే మన కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు బొక్కపెట్టడమన్న మాట! ఇక 'జయంతి' అంటే రిపోర్టులు బాగా రాయబడ్డం వల్ల ప్రమోషన్ కోసం ఎదురు చూడ్డమన్నమాట! తెల్సిందా?" ధర్మసూక్ష్మాన్ని సూపరెంట్ వినరించాడు.

"మన ఈ సర్వీసులో ఇప్పటికీ ఇంతమంది ఆఫీసర్లని చూశాం. రానీ! ఆ శ్రీ సంగతీ చూద్దాం!" తలమీద వెంట్రుకల్ని చూపిస్తూ అన్నాడు వెంకటేశం.

"జరిగేదేదో జరుగక మానదు. ఇప్పట్నుంచే బెంబేలు పడ్డం దేనికి? వచ్చేవారం ఎలాగూ వస్తాడుగ!" అనుకుని అంతా సరిపెట్టుకున్నారు.

నెలరోజులు ముందుకి జరిగాయి.

ఆ శ్రీ రావడం, పరిచయ కార్యక్రమాలు జరగడం — అన్నీ సవ్యంగా జరిగిపోయాయి. రోజులు గడుస్తున్న కొద్దీ శ్రీ పట్ల పేరుకున్న భయం— ఆందోళన అందులోంచి మంచులా కరిగిపోసాగాయి. [illegible] ప్రవర్తన అందరికీ ఎంతో సంతృప్తికరంగా ఉండటమే!

వీడు గుమాస్తా — తను సూపర్నెంటు—వాడు లేబరర్ — ఆయన సూపర్‌వైజరు అన్న తారతమ్యం లేకుండా అందరితోను ఆఫీసు వ్యవహారాలు —వీలున్నప్పుడు స్వ విషయాలు కూడా ఎంతో నెమ్మదిగా— ఆప్యాయంగా — ఆత్మీయంగా పరిష్కార మయేందుకు తగిన సలహాలు ఇస్తుండటం వల్ల శ్రీ వచ్చిన ఆర్నెల్లలోనే తనంటే అందరికీ మంచి అభిప్రాయం ఏర్పడింది.

అనవసరంగా ఏదేదో వూహించుకుని ముందు గాభరా పడ్డాం గాని — గురుడు నిజానికి మంచివాడే. మన పెద్ద ఆఫీసరులా చాలా మంచివాడేను! పోనీలే! ఇప్పుడున్న ఇద్దరు ఆఫీసర్లూ మంచోళ్ళు — నెమ్మదస్తులే!— అని ఇంచుమించు అంతా అభిప్రాయపడ్డారు.

ఆఖరికి శ్రీ రాకముందు తమ తమ అనుభవాల్లోంచి కొన్ని విషయాల్ని చెప్పిన వాళ్ళు కూడా— 'గురుడిలో అప్పటికీ ఇప్పటికీ చాలా మార్పు వచ్చిందే!?' అనుకుని ఆశ్చర్యంతో నోరు తెరిచేసి, 'పోనీలే! శ్రీ లో వచ్చింకె మంచి మార్పే!' అనుకున్ని తాము కూడా మిగతా వాళ్ళలో ఎంతో సంతోషించారు.

"ఆ ఆఫీసులో శ్రీ చిన్న ఆఫీసరైతే— సుందరం పెద్ద ఆఫీసరు. ఆఫీసులో పని సక్రమంగా—సవ్యంగా జరిగితే చాలు తనకు. ఎంతమంది సెలవులు పెట్టినా —ఆలస్యంగా వచ్చిన పట్టించుకోడు. కిందవాళ్ళకు 'స్వేచ్ఛ' అనేది ఉంటేనే ఏ పనైనా మనసు పెట్టి చేస్తారన్నది తన ప్రగాఢ విశ్వాసం నమ్మకం కూడాను!! సుందరం మూన్నెల్ల సెలవులో వెళ్ళిపోయి అప్పుడే ఒక నెలరోజులు కావస్తుంది. ఆఫీసు వ్యవహారాలనీ శ్రీ యే స్వయంగా చూసుకోసాగాడు.


ఎప్పుడూ ఆఫీసుకి ఆలస్యంగా వచ్చేవర గని కాషియర్ వరుసగా ఒక రెండ్రోజులు ఆలస్యంగా రావడం — ఎప్పుడూ ముందుగానే సెలవుమంజూర చేయించుకుని సెలవుల్లో వెళ్ళే శేఖర్ వూహించని పరిస్థితి వల్ల లీవ్ లెటరైనా ఇవ్వకుండా ఆదరాబాదరాగా తమ వూరెళ్ళిపోవడం జరగడంతో శ్రీ లోని మరో శ్రీ బయటికి రావడం, పర్యవసానంగా ఆఫీసులో ఆందోళన —అలజడి చోటు చేసుకున్నాయ్.

"ఎంతిదైతే మాత్రం మా ఫాదర్ పోతే కాళ్ళూ చేతులు ఆడని పరిస్థితిలో అంత్య క్రియలు జరిపించడం కోసం మా వూరెళ్ళి పోతే సింపతీ చూపించడం పోయి 'అనాథరయిజాడు ఏబ్సెన్సు' అంటూ నాకు వార్నింగు లెటరు ఇస్తాడా? వూరునుంచి లీవ్ లెటర్ పంపిస్తే పనికిరాదూ? ముందుగా సెలవు అనుమతి తీసుకోవాలా? గురుడి గురించి ఏదో అనుకున్నాం కాని, నిజంగా వీడు మానవత్వం లేని మనిషేను." తిరిగొచ్చిన శేఖర్ వార్నింగు లెటర్ చూసుకుంటూ అక్కసుగా అన్నాడు.

"అంతెందుకు? రేపో మాపో రిటైరవ్వడానికి సిద్ధంగా ఉన్న మన కాషియర్ ఒక గంట ఆలస్యంగా వచ్చాడని నెత్తి మీద పది మందిలో ఎన్ని చీవాట్ల అక్షింతలు వేశాడని. ?. . ." శ్రీను ఆశ్చర్యంగా, కోపంగా అన్నాడు.

"మీకు వాడి సంగతి పూర్తిగా తెలీదు కనకే ఇంత కాలమూ వాడి తేనె పూసిన మాటల్ని నమ్మి మోసపోయారు. పెద్దోడు సెలవులో పోగానే అన్ని అధికారాలు వీడి చేతికి వచ్చాయి కదా? అందుకనే ఇలా పేట్రేగి పోతున్నాడు. అన్నట్టు మీ కీ విషయం తెలీదు కదూ? కిందటి నెల్లో ఒక ఇరవై రోజులు జ్వరం పడ్డంవల్ల మన భాస్కర్ ఆఫీసుకి రాలేదు— గుర్తుందా? అప్పుడు వీడు భాస్కర్‌ది దొంగ జ్వరమా లేక నిజంగానేనా అన్న విషయం తెలుసుకోవడానికి మన ప్యూన్ని భాస్కర్ ఇంటికి పంపించాడు. కావాలిస్తే మన రాముల్ని అడిగి చూడండి. మన 'శ్రీ' ఎలాంటి 'ఛీ' గాడో మీకే తెలుస్తుంది." సూపరెంటు గోపాలం.

"నాలు గోడల మధ్య బంధిస్తే అసహాయ పరిస్థితిలో ఉన్న పిల్లికూడా తన పంజా విప్పుతుం



దన్న విషయం గురుడికి తెలీదు కాబోలు?..."
శ్రీను.

"కిందటి వారం మన సూపర్‌వైజరు మూర్తి తన కూతురు పెళ్ళికోసం తన ప్రావిడెంట్ ఫండ్ లోంచి లోన్ కోసం అప్లయ్ చేస్తే ఏం జరిగిందని?

నిజం పెళ్ళా? లేక డబ్బు కోసం పెళ్ళా? డబ్బొచ్చే మార్గ ముంటే ప్రతి నెలా పెళ్ళిలే మీకు. . . అంటూ ఎంత హేళన చేశాడు? చెట్టంత మనిషిని, మూర్తి లాంటి మర్యాద, మన్నన గల పెద్దమనిషిని ఎలా అవమానించాడు?

మన డబ్బు మనకు ఇవ్వడానికి మధ్యన వీడి పెత్తన మేమిటో? ఏదో వీడి జేబులో డబ్బిచ్చేస్తు న్నట్లు. . .?" ఆనందం.

"అవునవును. వీడి గురించి మొదట మనం ఏదో అనుకున్నాం కాని, వీడి అసలు స్వరూపం ఇప్పుడిప్పుడే


# మూర్తీభవించే మొగతనం



LD
ఓబ్రోన్
సూటింగ్‌లు
మరియు షర్టింగ్‌లు
ఎల్. డి. వీవింగ్ ఇండస్ట్రీస్ ప్ర. లి.
బొంబాయి- 400079.

national-678-TEL

బయట పడుతూంది. మనం జాగ్రత్తగా ఉంటూ సమయం, సందర్భం కలిసి వచ్చినప్పుడు వీడిని మనం 'సెట్' చేయాలి. లేకుంటే ఎంతకైనా తెగిస్తాడు. అందులోనూ వచ్చే నెల డిసెంబర్ కూడాను.'' మధుమూర్తి. డిసెంబర్ నెల అనగానే అందరికీ వర్ధంతులు, జయంతులు గుర్తుకొచ్చాయ్.

ఈ మధ్య అందరికీ ఏదో ఒక నెపంతో వచ్చిన, వస్తున్న వార్నింగ్ లెటర్స్‌కి అందరి లోనూ భయం చోటు చేసుకుంది.

'ఈ కాగితం పులి సి. ఆర్. లు తగలేయడు కదా?' అన్న ఆందోళన అందరిలోనూ చెలరేగింది.

రోజురోజుకీ, వారం వారంకీ వార్నింగ్ లెటర్సు అందుకోకుండా మిగిలి పోయిన వారికికూడా ఆఫీసులో నీ ప్రవర్తన బాగుండటం లేదనో, ఆఫీసు పని నీ మూలంగా దెబ్బ తింటుందనో, ఎక్కువగా సెలవులు పెడుతున్నా వనో, ఆఫీస రంటే ఖాత ర్లేకుండా తిక్క సమాధానాలు ఇస్తున్నా వనో, సకాలంలో పని పూర్తి చేయకుండా ఆడుకుంటున్నా వనో. . . ఏదో ( లేని ) కారణం చూపిస్తూ వార్నింగ్ లెటర్సు రావడంతో అందరిలోనూ జ్ఞాన నేత్రం తెరుచుకుంది.

ఇంతకాలమూ మనం 'యూనియన్' లేకుండా—ఏ యూనియన్‌కీ సంబంధం లేకుండా ఉండిపోయి ఎంత తప్పు చేశాం? ఇప్పుడు ఎవరైనా గొంతు చించుకుని ''నీ వ్యవహారవేమీ బాగాలేదు. అధికారం చేతిలో ఉందని నీఇష్టం వచ్చినట్లు వార్నింగ్ లెటర్స్ ఇవ్వడం గొప్పకాదు'' అని అంటే వారి సి. ఆర్. లు వీడు తగలెట్టేస్తాడే. . .?

లాభం లేదు. జరిగిందేదో జరిగి పోయింది. ఇప్పటికైనా అందరం కలిసి కట్టుగా ఉండాలి. ఇలాంటి 'శ్రీ'ల అహంకారాన్ని యూనియనే ఎదుర్కొంటుంది.

అయితే యూనియన్ ఫారం అయేలోగా వీడి నెలా భరించడం? వచ్చే సంవత్సరారంభంలో రానున్న ప్రమోషన్స్ సక్రమంగా రావాలంటే ఈ ఏడాది రిపోర్టులు బాగుండాలే! సి. ఆర్. లు తగలడితే ఆ ప్రమోష న్లెలా వస్తాయ్?. . .

అలా అంతా తర్జన భర్జనలు—బుర్రలు పాడు చేసుకోవడాలు—భయాందోళనలతో మూడు నెలలు ముందుకి జరిగి పోయాయ్. పెద్దాఫీసరు సుందరం తిరిగి ఆఫీసులో చేరడం, శ్రీ మళ్ళీ తన స్థానంలోకి రావడం జరిగింది.

ఈ లోగా శ్రీ ఆధ్వర్యంలో డిసెంబర్ నెల ప్రభావం వల్ల ఇంచుమించు అందరికీ వర్ధంతులు, ఒక రిద్దరికి జయంతులు జరిగిపోయాయ్.

* * *

ఎదురు చూస్తున్న ప్రమోషన్ల జాబితా రానే వచ్చింది. కనీసం ఈ సారి పది మందికైనా ఆ ఆఫీసులో సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ గారంటీ అనుకున్న అంచనా తప్పయింది. ఒకరికో ఇద్దరికో తప్ప మిగతా వాళ్ళెవరికీ ప్రమోషన్ రాలేదు. అవకాశా లన్నీ మిగతా బ్రాంచెస్ లోని జూనియర్లకే దక్కాయ్. దాంతో అందరి మనసులు కుత కుత లాడిపోయాయ్.

ఆ వేడిలో అంతా కలిసి తమ కో యూనియన్‌నీ,, యూనియన్ లీడర్నీ ఏర్పాటు చేసుకున్నారు.

అయినప్పటికీ వాళ్ళలో కోపం, అసహనం, బాధ తగ్గలేదు. ఏదైనా చేసి శ్రీకి కళ్ళు తెరిపించాలి. ఏం చేయాలి?. . . అందరిలోనూ ఏదో చేయాలన్న తపన, నిర్ణయం చోటు చేసుకున్నాయ్.

• • •

ఆ రోజు శ్రీ కెదురుగా కూర్చుని స్టెనో డిక్టేషన్ తీసుకుంటున్నాడు. ఇంతలో ఆఫీసుబంట్రోతు రాములు శ్రీ ముందు ఒక కవరుంచి వెళ్ళిపోయాడు. ఆ కవరు హెడ్డాఫీసునుంచి వచ్చిందని దాని మీదున్న ముద్రల్ని బట్టి గ్రహించాడు స్టెనో.

కవరు చించి లోనున్న కాగితాన్ని బయటికి తీసి చదివిన శ్రీ ముఖంలో రంగులు మారిపోయాయ్.

''సాబ్! బడా సాబ్ బులాతాహై'' అంటూ మరో బంట్రోతు ఖాన్ వచ్చాడు శ్రీ దగ్గరికి.

అసహనంగా—ఏకాగ్రంగా—కోపంగా, ''షైలిట్'' అంటూ ఆ ఉత్తరాన్ని స్టెనో కిచ్చి విసురుగా పక్క గదిలోని సుందరం దగ్గరకు వెళ్ళడానికి లేచాడు శ్రీ.

ఆ ఉత్తరం లోని విషయం ఏమిటా? అని అందులోని అక్షరాల వేపు తన చూపుల్ని పరుగెత్తించాడు స్టెనో. ఉత్తరం ఆద్యంతాలు చదివిన స్టెనో అధరాలపై చిరునవ్వు చోటు చేసుకుంది.

ఆ ఉత్తరం శ్రీకి సంబంధించింది.

స్టెనో ముఖం సంతోషంతో విప్పారడానికి కారణం ఆ లెటర్‌లోని సారాంశం—శ్రీకి 'వాలంటరీ రిటైర్‌మెంట్ రావడం తప్పని సరి. తనంతట తనే వాలంటరీ రిటైర్‌మెంట్‌కి అప్లయ్ చేసుకోవడం అన్ని విధాల మంచిదని వార్నింగు లాంటి సలహా హెడ్ ఆఫీసు నుంచి రావడం. తను తనంతట అలా చేయక పోయినా తన సర్వీసుకి స్వస్తి వాచకం పై అధికార్లు పలకడం తప్పనిసరి.

''అధికారం చేతిలో ఉందని ఇష్టం వచ్చినట్లు వార్నింగ్ లెటర్సు, చార్జ్‌షీట్సు ఇచ్చి అందరి సి.ఆర్.లు పాడు చేసి ఏదో అందరినీ నా చెప్పు చేతల్లో ఉంచుకో గలుగుతున్నా నని సంబర పడేకంటే వారి భవిష్యత్తుకి సి. ఆర్. ల ద్వారా మంచి పునాదులు వేసి వారిలోని తప్పుల్ని మంచిగా మందలింపు ధోరణిలో సరిదిద్ద గలిగే మంచి లక్షణం సంతరించుకోగలగడం నిజమైన ఆఫీసర్‌కి ఉండాల్సిన మంచి లక్షణం.

మీ సర్వీసులో మీరు పని చేసిన ప్రతి ఆఫీసు లోను మీ మూలంగా అసంతృప్తి చెలరేగిందన్న విషయం—ఎన్నో ఏళ్ళ నుంచి అవుట్ స్టాండింగ్ రిపోర్టు లున్న వారికికూడా మీ హయాంలో వారి రిపోర్టులు పాడవడం మీ భజనదార్ల సంక్షేమం గురించి అన్ని ఆఫీసు వ్యవహారాల్లోను అధికారాన్ని దుర్వినియోగం చేయడం. . . లాంటివి మాకు తెలియనివి కావు.

ఒక సీనియర్ ఆఫీసరై ఉండి ఈ స్థితికి కింద వర్గం నుంచి వచ్చిన వారై ఉండి, వారి సాధక బాధకాల్ని తెలిసున్న వారై ఉండికూడా మీ రిలా వ్యవహరించడం నిజంగా శోచనీయం...మీ మూలంగా మీరు కాలు పెట్టిన ప్రతి ఆఫీసులోనూ అసంతృప్తి చెలరేగడం మూలంగా పని వారంతా కలిసి యూనియన్లు ఏర్పాటు చేసుకోవడం, ఆ యూనియన్ల ద్వారా మీ చర్యలు మాకు తెలియడం అందులోని నిజానిజాలు మేము గ్రహించడం జరిగింది.

మీ సర్వీస్ ఈ ఏడాదితో ఇరవైమూడేళ్ళు పూర్తి కావస్తూంది. ఈ పరిస్థితుల్లో పనివారంద రిలో మీ మూలంగా చెలరేగిన అసంతృప్తి వైదొలగి ఇదివరకులా వాళ్ళంతా సమర్థవంతంగా ఆఫీసు వ్యవహారాలు నిర్వర్తించా లంటే మీ సమస్యకు పరిష్కారం జరగాలి.

ఈ సమస్యకు సొల్యూషన్ ఒక్కటే.

మీ లాంటి వారికి వాలంటరీ రిటైర్‌మెంటే చక్కటి గుణపాఠం. మా దాకా రానీయకుండా మీ అంతట మీరే ఆ పని చేయడం అందరికీ మంచిది. . .'' ఆ ఉత్తరం లోని విషయాలకి శ్రీ ముఖంలో రంగులు మారితే స్టెనో మాత్రం 'మా బాగా జరిగింది పీడా విరగడయింది' అనుకుని లోలోన ఎంతో సంతోషించాడు. *

